

# క్షీరసాగర మథనం

దాసరి మంజులత

కళ్ళు ఊటబావుల్లా ఉన్నాయి అన్నపూర్ణకి. కళ్ళలో నీరు ఊరడమేగాని ఆరటంలేదు నిన్నటినుంచి.

ఈవేళే వస్తున్నాడు మురళీబాబు. తన మురళీబాబు! ఇంకా తన మురళీబాబేమిటి? ఇకమీదట తనెవరో మురళీబాబెవరో! అందుకే బాధ!

మురళీబాబు వస్తాడు! ఎంతసేపు ఉంటాడు? తన కన్నతండ్రితో కలిసి విమానంలో వెళ్ళిపోతాడు! తను అందుకోలేనంత దూరం వెళ్ళిపోతాడు! ఈ పేద 'అమ్మ' జీవితాంతం నడిచినా అందుకోలేని దూరం వెళ్ళిపోతాడు. అమ్మని మర్చిపోతాడు.

తలచుకొంటేనే దుఃఖం పొంగిపొంగి వస్తోంది. అన్నపూర్ణ భర్త రాఘవరావు ఆమెను ఊరడిస్తూనే ఉన్నాడు. వారిస్తూనే ఉన్నాడు. ఆయనకి మనసులో ఎంత దుఃఖం ఉందో! కొంతవరకైనా అర్థంచేసుకోగలదు అన్నపూర్ణ! ఆయన పైకి ఉబకడు!

తనో! తను అట్లా ఉండగలదా? అంత గంభీరంగా ఉండగలదా? మురళీబాబుకి ఇకముందు తనేమీ కాదని తేలికగా అనుకోగలదా? మురళీబాబును ఇకపై చూడకుండా బ్రతకగలదా?

పదహారేళ్ళుగా పెంచుకున్న బంధం ఇది. తనూ, తన భర్త అనుక్షణం వాడికోసం శ్రమించారు. వాడికోసం బ్రతి

కారు. తమ జీవితాలకు వాడిని కేంద్రం చేసుకున్నారు. తమ కలలన్నీ వాడి భవిష్యత్తులో చూసుకున్నారు. వాడి బాగే జీవిత లక్ష్యంగా, వాడే ఊపిరిగా బ్రతుకుతున్నారు.

పదహారేళ్ళ క్రితం....

అప్పుడు వాడికి ఆరేళ్లు. వాడు భూమిమీద పడగానే కన్నతల్లి కరువయింది. తండ్రి అప్పులలో, కోర్టు కేసులలో మునిగి ఉన్నాడు. తనను తానే పోషించుకోలేని స్థితిలో శరణాలయంలో కొడుకుని చేర్పించాడు, కనీసం రోజూ తిండి అయినా ఉంటుందని.

తల్లి ప్రేమ, క్రమశిక్షణ లేని పిల్లవాడవటంవల్ల శరణాలయంలో మురళి ఎగ్రసివ్‌గా దురుసుగా ఉండేవాడు. చిన్నచిన్న దొంగతనాలు మొదలుపెట్టాడు. శరణాలయం అధికారులతో అబద్ధాలు చెప్పడం, వాళ్ళని ఎదిరించడం, తోటిపిల్లలని కొట్టడం మొదలుపెట్టాడు.


శరణాలయం అధికారులు విసిగిపోయారు. మురళిని బాలనేరస్థుల గృహానికి పంపే ఆలోచనలో ఉన్నారు శరణాలయంలో పిల్లలెవరూ అతనితో కలవరు. పెద్దవాళ్లు సహితం ఈ పిల్లవాడిని దూరంగా ఉంచడం మొదలుపెట్టారు. అతనిని ప్రేమించేవాళ్ళు ఎవరూ లేరు సరిగదా, ఒక మంచిమాట అనేవారు కూడా కరువయ్యారు. అతనికి టైఫాయిడ్ జ్వరం వచ్చింది. సపర్యలు చెయ్యడానికి ఆయాలు సహితం సుముఖంగా లేరు.

మొత్తానికి మురళి జ్వరంనుంచి బయటబడి బ్రతికి బట్టకట్టాడు. కాని మానసికంగా, శారీరకంగా దయనీయమైన స్థితిలో ఉన్నాడు. ఆ స్థితిలో వాడినిగురించి కొంచెమైనా ఆందోళన పడింది సరస్వతమ్మగారు.

సరస్వతమ్మగారు ఒక సోషల్ వర్కర్. ఆమె అన్నపూర్ణకి బాగా తెలుసు. ఆమె శరణాలయం మంచిచెడ్డలు చూస్తూ ఉండేది. ఒక సందర్భంలో ఆమె అన్నపూర్ణ రాఘవరావుల దగ్గర, ఈ పిల్లవాడిని గురించి మాటవరసగా చెప్పింది. అన్నపూర్ణకి అప్పటికే నలభైయేళ్లు దాటాయి. పిల్లలు లేరు. కాని ఎన్నడూ ఒక పిల్లనో పిల్లవాడినో తెచ్చి పెంచుకుందామన్న ఆలోచనా లేదు.

సరస్వతమ్మగారు మాటవరుసగా చెప్తే పిల్లవాడి సంగతి అన్నదిగాని, ముక్కూమొఖం తెలియని ఆ పిల్లవాడు రెండు రోజులపాటు రాఘవరావు అన్నపూర్ణల ఆలోచనలని వదిలిపెట్టలేదు.

దాని ఫలితంగా ఆరేళ్ళ మురళి సరస్వతమ్మగారితోపాటు రాఘవరావు అన్నపూర్ణ ఉండే తోటకు వచ్చాడు. ఊరి పొలిమేరల్లో ఉన్న అయిదెకరాల



కూరగాయల తోట అది. తోట మధ్యలో చిన్న పెంకుటిల్లు. రెండు పాడిపశువులు. ఆ తోటే వాళ్ళ జీవనాధారం.

అన్నపూర్ణ ఆప్యాయంగా అన్నం పెట్టింది మురళికి. తోటంతా తిప్పి చూపింది.

"ఇక్కడ ఎంతో నచ్చినట్లుంది మీకు. కదూ మురళీ!" సరస్వతమ్మగారు అడిగిన ప్రశ్నకి మురళి అవునన్నట్లు తల వూపాడు బిడియంగా.

"అంత నచ్చితే ఇక్కడ నాలుగు రోజులు ఉంటావులెండి మురళి" అన్నాడు రాఘవరావు నవ్వుతూ.

అట్లా మురళి ఉండిపోయాడు. నాలుగు రోజులు కాదు. ఇప్పటికీ. అట్లా అన్నపూర్ణని 'అమ్మ'ని చేసుకొన్నాడు. రాఘవరావుని 'నాన్న'ని చేసుకొన్నాడు. వాళ్ళ మనసుల్ని పూర్తిగా ఆక్రమించుకున్నాడు.

రెండేళ్ళకి....

సరస్వతమ్మగారే ఆశ్చర్యపోయేట్లుగా శరణాలయంలో చదువు, స్కూలు ఎగవేసి మొద్దబ్బాయిగా పేరు తెచ్చుకున్న మురళి, ఇప్పటి స్కూలులో ఫస్టు వచ్చాడు. అంతేగాదు; ప్రైమరీస్కూలు అంతటికీ "బెస్టుబోయ్" అన్న సర్టిఫికెట్టు తెచ్చుకొన్నాడు.

మురళి ఇంజనీరింగ్ పాసయ్యాడు. మద్రాసులో ఎం.టెక్. చదువుతున్నాడు మెరిట్ స్కాలర్‌షిప్‌మీద. ఏడాదిగా తనకు వస్తున్న స్టయిపెండుని ఇంటికి రాఘవరావుకు పంపుతున్నాడు, కొంతవరకైనా తన చదువుకు అయిన అప్పులు తీర్చమని. తోట ఎప్పుడో తాకట్టులో పడింది మురళి చదువువల్ల. ఆ విషయం పోయినసారి మురళి మద్రాసునుండి సెలవులకు వచ్చినప్పుడుగాని తెలిసి

తెలియలేదు. అప్పటిదాకా గోప్యంగా ఉంచగలిగాడు రాఘవరావు.

అందుకే ఈ మధ్య మురళి రావడం బాగా తగ్గించాడు, ప్రయాణపు ఖర్చులు కలిసివస్తాయని. ఎన్నాళ్ళయిందో మురళిని చూసి!

ఇప్పుడు వాడు వస్తున్నాడన్న సంతోషమే లేదు. శాశ్వతంగా దూరమవుతున్నాడన్న బాధ తప్ప!

మురళి తండ్రి మురళిని తీసుకు వెళ్ళడానికి వచ్చాడు. అతను మురళి శరణాలయంలో ఉండగానే జైలుపాలయ్యాడు. అప్పులపాలయి ఇబ్బందులలో ఇరుక్కుని, ఒక కొట్లాటలో ఇరుక్కుని, క్రిమినల్ కేసులో ఇరుక్కుని, రెండేళ్ళకి బయటపడ్డాడట. ఆ తర్వాత గల్ఫ్‌దేశాలకు రోజువారీ కూలీగా వెళ్ళి, డబ్బు సంపాదించి వ్యాపారం ప్రారంభించాడు. అదృష్టదేవత వరించింది. రకరకాల వ్యాపారాలు పెరిగాయి. వేలు లక్షలయ్యాయి. లక్షలు కోట్లుగా మారుతున్నాయి. ఇప్పుడు పరిశ్రమలు ప్రారంభించబోతున్నాడు. అతను మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు. కాని పిల్లలు లేరు.

ఆతనికి తన వారసుడు కావాలి. తన కొడుకు తనకు తిరిగి కావాలి. మద్రాసులో మురళిని ఇదివరకే చూసివస్తుండేవాడు. రాఘవరావు అన్నపూర్ణ దగ్గరకు వచ్చి కృతజ్ఞత తెలియజేశాడు. తన కోరిక కూడా వెల్లడించాడు.

ఏమనగలడు రాఘవరావు? పిల్లవాడి భవిష్యత్తు తండ్రిదగ్గర ఉజ్వలంగా ఉంటుంది. వాడు చదివిన చదువు సార్థకమవుతుంది. తనూ అన్నపూర్ణా తల్లక్రిందులుగా తపస్సుచేసినా పిల్లవాడికి ఆ అవకాశాలు కల్పించగలరా?

కాని... ....

కాని ఏముంది? ఏం లేదు. దుఃఖం తప్ప ఏం లేదు. బాధ తప్ప ఏం లేదు.

"వాడిని కనలేదన్నంత మాత్రాన వాడికి నేను తల్లినికాకుండా పోయానా?" అంటూ ఏడిచింది అన్నపూర్ణ. అన్నపూర్ణ పైకి ఏడిచింది. రాఘవరావు పైకి ఏడవలేదు అంతే తేడా!

మురళిబాబు వచ్చాడు. వాడని చూడగానే మధితసాగరంలో ఉన్న అన్నపూర్ణ ముఖంలో, కళ్ళలో అమృతబిందువు లుద్భవించాయి! నిస్తేజమైన రామవరావు ముఖంలో చిన్న వెలుగు తొంగిచూచింది.

కాని... ....

మురళి ముఖంలో ఎంతో దూరంనుంచి తనకోసం వచ్చిన కన్నతండ్రిని చూసిన సంతోషం స్పష్టంగా కనబడింది. అది అన్నపూర్ణకి ముల్లులా గుచ్చుకుంది.

"అదేటమ్మా అట్లా అయిపోయావు?" అని అడిగాడు మురళి అన్నపూర్ణని చూస్తూనే. తను క్రితంసారి చూసిన ఈ తొమ్మిది నెలలలోనే హఠాత్తుగా పదేళ్ళ వయస్సు పెరిగినట్లు కనబడుతోంది. రాఘవరావులో సహితం వార్థక్యం కొట్టవచ్చినట్లు కనబడుతోంది.

వాళ్ళద్దరిముందు ఇంకా ఏభై ఏళ్ళు కూడా నిండని కన్నతండ్రి చాలా చిన్నవాడిలాగే దాదాపు యువకుడిలాగే అనిపించాడు.

సరస్వతమ్మగారూ వచ్చారు అక్కడికి. ఆమెకి రాఘవరావు తెలియజేశాడు మురళి తండ్రి విషయం. మురళి వెళ్ళిపోతున్న విషయం. అందుకే ఆమె వచ్చింది.

మురళి ఎప్పటిలాగే తోట చూచి వస్తానంటూ ఊరునుంచి రాగానే బయల్దేరాడు. అయిదు నిమిషాలు తిరక్కుండా తిరిగి వచ్చేశాడు,

"అదేమిటి నాన్నా? మొక్కలేం లేవే? ఉన్న నాలుగూ కూడా ఎండిపోయాయి? క్రొత్తవి వెయ్యలేదేం? పాడి పశువు లేవీ?" ఆశ్చర్యంగా అడిగాడు.

"క్రొత్త మొక్కలు ఎందుకు నాన్నా? అవి కాపుకొస్తే చూసి కేరింతలు కొట్టే చిన్నారి మురళి ఏడీ? తన చిన్ని చేతులతో టొమాటాలు కోసి అమ్మకు తినిపించిన మురళి ఉండడుగా నాన్నా? ఇక మొక్కలు దేనికి? మొక్కలు ఎండిపోయాయి. మా జీవితాలే ఎండిపోతాయి నువ్వు లేకపోతే?" అన్నపూర్ణ మనస్సు మూగగా రోదిస్తోంది. ప్రయత్నంమీద పైకిమాత్రం మామూలుగా ఉంది. అతి ప్రయాసమీద చిరునవ్వు తెచ్చుకుంది. కాని అది నవ్వులా లేదు. ఈ ప్రయత్నం అంతా మురళికోసం. వెళ్లేటప్పుడు వాడు తనను గురించి బాధపడకుండా ఉండటంకోసం. రాఘవరావు కోరికపై తాత్కాలికంగా కన్నీటికి ఆనకట్ట కట్టగలిగింది.

"ఏమో నాన్నా! అంత శ్రద్ధ చెయ్యలేదీసారి తోటిగురించి. ఎన్నాళ్ళు చెయ్యగలం చెప్పు? వయసు అయిపోవడం లేదూ?" తేలిగ్గా నవ్వడానికి ప్రయత్నిస్తూ అన్నాడు రాఘవరావు.

"తోట బేరం పెట్టారు మురళీ! ఈ ఉద్యోగంలో చేరాక తోటలో పని చూడ్డానికే కుదరటంలేదు మీ నాన్నగారికి" అంది సరస్వతమ్మగారు.

"ఉద్యోగం ఏమిటి?" అని అడిగాడు మురళి ఆశ్చర్యంగా.

"అదేమిటి? ఏడాదిగా శరణాలయంలో ఎకౌంట్సు చూడ్డానికి కుదిరారు మీ నాన్నగారు. నీకు తెలియదా?"

"నిజమా? నాకు చెప్పలేదేం?" మురళి రాఘవరావుకేసి తిరిగాడు. ఆయన

ప్రక్కనే కూర్చునుంది అన్నపూర్ణ.

ఏదో చూస్తూ వాళ్ళకేసి పరిశీలనగా చూశాడు మురళి.

మురళికి ఎవరూ ఏ సమాధానం చెప్పలేదు. చెప్పకుండానే ఎన్నో అర్థమయ్యాయి మురళికి. అప్పులు, కాకట్టు, డబ్బు అవసరాలు, వార్ధక్యం, నిస్సహాయత.... ఎన్నో!

"ఈ వయస్సులో.... ఇప్పుడు.... నువ్వు ఉద్యోగంలో చేరావా?" మురళి గొణుక్కుంటున్నట్లు అన్నాడు.

"నాకు కాలక్షేపం కావాలి కద నాన్నా! ఈ వయస్సులో శరీరకష్టం చెయ్యలేం కదా! అందుకే...." అంటూ చెప్పబోయాడు రాఘవరావు.

మురళి వినిపించుకోలేదు.

"తోట బేరం పెట్టొద్దు నాన్నా! నేను మళ్ళీ నారు తెచ్చి వేయిస్తాను. మళ్ళీ తోట ఎప్పటిలాగే చేద్దాం. బ్యాంకిలో లోనుకి అప్లయి చేస్తాను" అన్నాడు మురళి. అతని మాటల్లో తిరుగులేని నిర్ణయం ధ్వనించింది. అన్నపూర్ణ ఉబికి వచ్చే కన్నీరు ఆపుకోలేకపోతోంది.

కష్టం ఎక్కువయినా, సంతోషం ఎక్కువయినా కన్నీరే వస్తుంది. ఆ కన్నీటిని ఆపలేకపోయాడు రాఘవరావు.

"లోన్ అక్కర్లేదు నాన్నా! నువ్వు పంపిన నీ స్టయిఫండు డబ్బు వేరే దాచాను" అన్నాడు.

"అదేమిటి? నువ్వు వెళ్ళిపోవా..." అంటూ ఏదో సరస్వతమ్మగారు అనబోయారు మురళితో.

"ఉహుఁ! నే నెక్కడికీ వెళ్ళను. ఇక్కడే ఉంటాను" ఆశ్చర్యంగా చూస్తున్న తన కన్నతండ్రికేసి తిరిగి అన్నాడు మురళి "మీరేం అనుకోరు కదూ?"

ఒక నిమిషం పట్టింది ఆయనకి తన ఆశ్చర్యంనుంచి తేరుకోవడానికి. వచ్చి కొడుకుని కౌగలించుకున్నాడు

"నీకు ఏం చెయ్యలేకపోయినా, కనీసం జన్మనిచ్చినందు కయినా గర్వపడుతున్నాను నాయనా!"

